క్లుప్తంగా

నిరుపయోగంగా జనరేటర్



పొన్నూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జనరేటర్ వినియోగానికి నోచుకోక మూలకు చేరింది. విద్యుత్ కోతల నేపథ్యంలో గతంలో ప్రభుత్వం డీజిల్‌తో నడిచే జనరేటర్ మంజూరు చేసింది. అయితే, డీజిల్ కొనాల్సి వస్తుందన్న కారణంగా అధికారులు మూలకు చేర్చినట్లు తెలిసింది. చిన్న కారణంతో రూ. లక్ష విలువ చేసే జనరేటర్‌ను పక్కన పెట్టడం అధికారుల పనితీరుకు అద్దం పడుతుంది. ఇప్పటికైనా స్పందించి జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని సిబ్బంది కోరుతున్నారు.

విరిగిపోయిన కుళాయితో అవస్థలు



పొన్నూరు: పురపాలక పరిధిలోని 12వ వార్డు ఎరుకల వాడలో కుళాయి విరిగిపోవడంతో నీటిని పట్టుకోవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వీధి పంపు కావడంతో వాడ ప్రజలు అధిక సంఖ్యలో నీటిని పట్టుకుంటారు. ప్రస్తుతం కుళాయి విరిగి సమస్య ఏర్పడడంతో అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కొత్త కుళాయిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ప్రత్తిపాడు: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వట్టిచెరుకూరు సీఐ రామానాయక్ సూచించారు. పోలీసు అమరవీరుల స్మారకోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు 'సైబర్ నేరాలు అరికట్టడంలో యువత పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఆసక్తి గా పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను సీఐ రామానాయక్ అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రత్యేక కౌంటర్లు

కొరిటెపాడు: గుంటూరు సర్కిల్ పరిధిలో విద్యుత్ బిల్లులు చెల్లించే వారి కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు గుంటూరు సర్కిల్ పర్యవేక్ష ఇంజినీర్ కె.వి.ఎల్.ఎన్.మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం కూడా విద్యుత్ బిల్లులు చెల్లించేలా కౌంటర్లు పని చేస్తాయని వెల్లడించారు. సర్కిల్ పరిధిలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇంటి నుంచే నేరుగా మొబైల్లో ఏపీసీపీడీసీఎల్ కస్టమర్ యాప్, ఫోన్ పే, గూగుల్ పేల నుంచి కూడా బిల్లులు చెల్లించవచ్చని సూచించారు.

ఉత్సాహంగా బాలల క్రీడోత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్: జీకేఆర్ హైస్కూల్ పట్టాభిపురం, ఏటీ అగ్రహారం క్యాంపస్‌లలో శనివారం బాలల క్రీడోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు జి.కొండారెడ్డి, జి.జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడోత్సవాలను ప్రారంభించామని చెప్పారు. ఇందులో భాగంగా వచ్చే నెల 13వ తేదీ వరకు విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. క్రికెట్, కబడ్డీ, సైక్లింగ్, ఖో-ఖో, స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్స్ తదితర క్రీడలతో పాటు స్పెల్‌బీ, వ్యాసరచన, వక్తృత్వ, జనరల్ నాలెడ్జ్, తెలుగు పద్యాలు, నీతి కథలు, పొడుపు కథలు, గణిత, సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. నవంబర్ 14 వరకు పెద్దఎత్తున పోటీలను నిర్వహిస్తూ, విద్యార్థులను ఉత్సాహ పరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ శైలజ, సుశీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలో మనీషా ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: హిందూపురంలో ఇటీవల జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి బాలికల వాలీబాల్ టోర్నమెంట్‌లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి. సునీత తెలిపారు. సాంబశివపేటలోని కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు గుంటూరు జిల్లా తరఫున పోటీపడిన టీం ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. టీంలో తమ కళాశాల జూనియర్ ఇంటర్ సీఈసీ విద్యార్థిని బి. మనీషా ప్రాతినిధ్యం వహించినట్లు వివరించారు.

ప్రాధాన్యం మరచి.. పార్కులకు సోకులు

- అపరిష్కృత తాగునీటి సమస్యను పక్కనబెట్టి..
- ఆకర్షణీయంగా ఉన్న పార్కుకు మళ్లీ రంగులు..
- కాంట్రాక్టర్ల లబ్ధికి ప్రాధాన్యం
- పొన్నూరు మున్సిపాలిటీ పనితీరుపై విమర్శలు



2022 మార్చిలో నిర్మితమై ఆకర్షణీయంగా ఉన్న నిడుబ్రోలు మున్సిపల్ పార్కు

పొన్నూరు: ప్రజారోగ్యానికి పాలకుల దృష్టిలో ప్రాధాన్యం లేదు. వృథా ఖర్చులతో కాంట్రాక్టర్ల సౌఖ్యమే ప్రధాన ధ్యేయంగా మున్సిపాలిటీ వ్యవహరిస్తోంది. పట్టణంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను గాలికొదిలేసి.. అవసరం లేని పనులు చేపడుతోంది. ముఖ్యంగా దీర్ఘకాలికంగా తాగునీటి సమస్య ఉంది. నిడుబ్రోలు తాగునీటి పథకం నుంచి రంగు మారిన నీళ్లనే పట్టణ ప్రజలు వినియోగిస్తున్నారు. తాగునీటిపై పురప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోవడం లేదు. పురపాలకకు రూ.కోట్ల ఆదాయాన్ని సమకూర్చే దుకాణ సముదాయాలకు మరుమ్మలులు చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ట్రాక్టర్ల ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేస్తున్న మున్సిపల్ అధికారుల పనితీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పట్టణంలో జటిలంగా తాగునీటి సమస్య

నిడుబ్రోలు రక్షిత తాగునీటి పథకం నుంచి పట్టణంలోని 31 వార్డులకు సరఫరా అయ్యే తాగునీరు కలుషితమై(పచ్చ రంగు)లో వస్తుందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఫిర్యాదులు వచ్చిన సమయాల్లో మున్సిపల్ అధికారులు ప్లాంటును సందర్శించి తాత్కాలిక చర్యలు చేపట్టి ప్రజలను మభ్యపెడుతున్నారు. శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రక్షిత తాగునీటి పథకంలో పాడైన ఫిల్టర్ బెడ్లకు త్వరలోనే శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారు. తక్కువ వ్యయ, తక్కువ సమయంలోనే తాగునీటి పథకంలో ఫిల్టర్ బెడ్లు మార్చే అవకాశాలున్నాయి. కానీ ప్రజారోగ్యాన్ని పక్కనబెట్టి, నిడుబ్రోలు మున్సిపల్ పార్కుకు రూ.10 లక్షల వ్యయంతో రంగులు వేసే పనికి అధికారులు శ్రీకారం చుట్టడంపై విమర్శలు వస్తున్నాయి.

రూ.10 లక్షలతో మళ్లీ రంగులు



ప్రస్తుతం రంగులు వేసిన మున్సిపల్ పార్కు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాం 2022లో నిరుపయోగంగా ఉన్న చెరువును సుమారు రూ.కోటితో అత్యాధునిక సౌకర్యాలతో పార్కు అభివృద్ధి చెశారు. పార్కులోని అన్ని ప్రదేశాలను రంగులతో తీర్చిదిద్దడంతో ఆకర్షణీయంగా ఉంది. కానీ మున్సిపాలిటీలో మూలుగుతున్న కోట్ల రూపాయల ప్రజాధనానికి జమ ఖర్చులు చూపించడమే పనిగా పార్కుకు రంగులు వేస్తున్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభల నిర్వహణ



డీటీకి సమస్యలను విన్నవిస్తున్న రైతులు

ప్రత్తిపాడు: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తోందని డెప్యూటీ తహసీల్దార్ వై. ధర్మతేజ అన్నారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడులో శనివారం గ్రామసభను నిర్వహించారు. పలువురు భూమి విస్తీర్ణం తగ్గడం, అడంగల్, భూ హక్కు పత్రాల్లో పేర్ల సవరణకు అర్జీలు అందించారు. కొందరు రైతులకు సంబంధించిన భూముల సర్వే నంబర్లు దేవదాయ శాఖకు చెందిన 22-ఏ రిజిస్టర్‌లో నమోదై ఉన్నాయని, వాటి వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని డీటీని కోరారు. వివిధ రకాల భూ సమస్యలకు సంబంధించి మొత్తం 54 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వై. ధర్మతేజ మాట్లాడుతూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి. రామకృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారి రాజేష్, గ్రామ సర్వేయర్ నీలిమ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించండి

నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశం



ఇళ్లను పరిశీలిస్తున్న కమిషనర్

గుంటూరు రూరల్: అడవితక్కెళ్లపాడు టిడ్కో గృహ సముదాయంలో మౌలిక వసతుల కల్పనలో అధికారులు శ్రద్ధ తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం ఆయన టిడ్కో ఇళ్లను అధికారులతో కలిసి పరిశీలించారు. నివాసితుల సంఖ్య, ఖాళీగా ఉన్న ప్లాట్ల వివరాలను టిడ్కో అధికారులను అడిగి తెలుసుకున్నారు. టిడ్కో వైపు నుంచి పెండింగ్ పనులు పూర్తి చేయడానికి కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. స్థానికులతో సమస్యలపై మాట్లాడారు. వెంటనే వాటిని పరిష్కరించాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారుల్ని ఆదేశించారు. అక్కడి ప్రజలు తాగునీరు, వీధి దీపాలు, అప్రోచ్ రోడ్డు, చెత్త సేకరణ సమస్యల్ని తన దృష్టికి తెచ్చారని, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ప్లాట్లకు తాగునీరు అందేలా చూడాలని, రాకపోకలకు ఇబ్బంది లేకుండా రోడ్ల మరమ్మతులు చేపట్టాలని చెప్పారు. వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఏఈని ఆదేశించారు. ప్రతి రోజు ఇంటింటి చెత్త సేకరణ జరగాలని, ఖాళీ స్థలాల్లో చెత్త కుప్పలు వేయకుండా చూడాలని శానిటేషన్ కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్‌ని ఆదేశించారు. ఆయన వెంట టిడ్కో ఈఈ ప్రసాదరావు, జీఎంసీ ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ హనీఫ్, ఎంహెచ్‌ఓ రామారావు, ఎస్ఎస్ సోమశేఖర్ ఉన్నారు.

సందడిగా ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలంలోని పుల్లడిగుంటలో గల మల్లినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాల 15 వసంతాల వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు. గ్రామీణ విద్యార్థులకు ఉత్తమ సాంకేతిక విద్యను అందిస్తూ వారి భవిష్యత్తును బంగారు బాటలు వేస్తున్న మల్లినేని విద్యా సంస్థలను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాజధాని ప్రాంత అభివృద్ధిలో భాగం కావాలని తెలిపారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మల్లినేని పెరుమాళ్లు మాట్లాడుతూ కళాశాల ప్రముఖ సాంకేతిక సంస్థలు అయిన ఎన్‌బీఏ, నాక్ ఏ ప్లస్‌తో స్వయం ప్రతిపత్తి కలిగిన విద్యాసంస్థలుగా ఎదిగినటట్లు చెప్పారు. విద్యార్థులు ప్రముఖ ఐటీ బహుళ జాతి సంస్థలల్లో మంచి స్థానంలో ఉండడం సంతృప్తిని ఇస్తుందని తెలిపారు. కళాశాల అభివృద్ధిలో భాగమై గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ గాయకుడు శ్రీరామచంద్ర ప్రత్యక్ష సంగీత విభావరిని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఐదు వేల మంది విద్యార్థులతో పాటు అతిథులు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు, డైరెక్టర్ దేవిరెడ్డి శ్రీనివాస్ కుమార్, డీన్ అకడమిక్స్ ప్రొఫెసర్ జె.కిషోర్ బాబు, డీన్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ పోపూరి రమేష్‌బాబు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

నగరంపాలెం: బాలల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం పోలీస్ అధికారులు, బాలల సంక్షేమ అధికారులు, ప్రత్యేక జువెనైల్ పోలీస్ యూనిట్స్ సభ్యులకు జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. సంస్థ కార్యదర్శి టి.లీలావతి అధ్యక్షత వహించారు. పల్నాడు ఏఎస్పీ లక్ష్మీపతి, గుంటూరు డీఎస్పీ డీవీ సుబ్బారావు మాట్లాడుతూ ప్రత్యేక జువెనైల్ చట్టం నిబంధనలను అమలు చేసే విధానాన్ని తెలుసుకోవాలని సూచించారు. విచారణ ప్రక్రియలో పోలీసుల పాత్ర, అస్తులు స్వాధీనంలో చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలీసుల సందేహాలను పీపీ ఎస్.సుకుమార్, డీసీపీఓ సీహెచ్.విజయ్‌కుమార్, క్రాఫ్ సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ప్రమీల, నాల్గవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) గుంటూరు-కం- ప్రిన్సిపాల్ మేజిస్ట్రేట్ జువెనైల్ జస్టిస్ బోర్డు వి.నవ్యశ్రీ , నాల్గవ అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు నివృత్తి చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, ట్రైనీ న్యాయమూర్తులు , పోలీస్ అధికారులు, స్పెషల్ జువెనైల్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించాలి

మేజిస్ట్రేట్ కె.లత



నల్లపాడు పీఎస్ సీఐకు ప్రశంసా పత్రం అందిస్తున్న ఎస్పీ, మేజిస్ట్రేట్

నగరంపాలెం: పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించాలని మేజిస్ట్రేట్ కె.లత పోలీస్ అధికారులకు తెలిపారు. ఇటీవల కొత్త చట్టాలు అమలవుతున్నాయని, కేసులు నమోదులో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో శనివారం పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. వారెంట్లు ఎల్‌పీసీ పెండింగ్ తదితర కేసుల పరిష్కారం గురించి మేజిస్ట్రేట్ కె.లత వివరించారు. కేసులను ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించి, సంఖ్య తగ్గించాలని పేర్కొన్నారు. కేసుల దర్యాప్తుల్లో పాటించాల్సిన మెలకువలను తెలియజేశారు. ఇటీవల లోక్‌అదాలత్ లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ వేగవంతం చేయాలని సూచించారు. రౌడీషీటర్లను స్థానిక ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద రూ.5 లక్షల పూచీకత్తుతో బైండోవర్ చేయించాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, డీఎస్పీలు అబ్దుల్ అజీజ్ (తూర్పు), జయరాం ప్రసాద్ (పశ్చిమ) మురళీకృష్ణ (మంగళగిరి), బి.సీతారామయ్య (ఎస్‌బీ), సుబ్బారావు (మహిళా పీఎస్), శివాజీరాజు (సీసీఎస్), శాంతకుమార్ (ఏఆర్), సీఐలు, ఆర్‌ఐలు, ఎస్పీ సీసీ ఆదిశేషు పాల్గొన్నారు.

నేడు బ్రెయిన్ హెల్త్ వాక్

గుంటూరు మెడికల్: వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ గుంటూరుశాఖ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో ఆదివారం ఉదయం 6 గంటలకు బ్రెయిన్ హెల్త్ వాక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ డాక్టర్ పమిడిముక్కల విజయ తెలిపారు. బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం నుంచి గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్ వరకు ర్యాలీ కొనసాగుతోందని పేర్కొన్నారు. బ్రెయిన్ హెల్త్ వాక్‌లో గుంటూరు నగరానికి చెందిన న్యూరాలజిస్టులంతా పాల్గొనాలని ఆమె కోరారు.

గాయకుడు స్టాలిన్ బాబుకు నివాళి



లక్ష్మీపురం: గాయకుడు స్టాలిన్ బాబు మృతి తీరనిలోటని మహతీ స్వరసుధ కోఆర్డినేటర్ మదన్‌మోహన్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలంయలో శనివారం కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో స్టాలిన్‌బాబు సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్టాలిన్ బాబుకు చదువు లేక పోయినా ఘంటసాల పాటలను మక్కికి మక్కీగా పాడుతూ మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ మేనేజర్‌గా బాలాజీ బాషా

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ మేనేజర్‌గా బాలాజీ బాషాను నియమిస్తూ కమిషనర్ పులి శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం ఇప్పటి వరకు మేనేజర్‌గా పనిచేసిన ఎస్ఎన్ ప్రసాద్‌ను కమిషనర్ పేషీకి, అడిషనల్ ఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న జె. రామారావును ఉపా సెల్ పీఓగా, మరికొంత మందికి స్థాన చలనం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జీజీహెచ్ ఈఎన్‌టీ వైద్యుడిపై ఫిర్యాదు

గుంటూరు మెడికల్: తనపై ఈఎన్‌టీ వైద్యుడు దురుసుగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స కోసం వచ్చిన ఓ యువతి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసింది. సెక్రటేరియట్‌లోని ఉన్నతాధికారి ఒకరు కుమార్తెకు ఈఎన్‌టీ సమస్య రావడంతో గుంటూరు జీజీహెచ్‌కు శనివారం పంపించారు. ఓపీ విభాగంలో వైద్యుడు చికిత్స చేసే సమయంలో ఆమెపై దురుసుగా ప్రవర్తించాడని యువతి ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసింది. ఈవిషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఈఎన్‌టీ వైద్యుడిపై యువతి ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని తెలిపారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వకపోవడంతో ఈఎన్‌టీ వైద్యుడిని మందలించామని వెల్లడించారు.

సాంకేతికతతో వాతావరణంలో మార్పుల నియంత్రణ

ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.ప్రసాదరావు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

చేబ్రోలు: సాంకేతిక పరిజ్ఞానంతో వాతావరణ మార్పులను సమర్థంగా నియంత్రించవచ్చని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.ప్రసాదరావు అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో శనివారం ''బ్రిడ్జింగ్ ద గ్యాప్ : లీగల్ అండ్ టెక్నికల్ అప్రోచెస్ టు క్లైమేట్ చేంజ్'' అనే అంశంపై ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు ఇప్పుడు ప్రధాన సమస్యగా మారాయని, మన దేశంలో విపత్తులని సష్టిస్తున్నాయని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించడానికి చట్టబద్ధతతో కూడిన సాంకేతిక పరిష్కారాలను అనుసంధానం చేయడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. దేశంలో జాతీయ వాతావరణ మార్పుల కార్యాచరణ ప్రణాళిక (ఎన్ఏపీసీసీ) ప్రకారం పరిరక్షణ చట్టాలు, పర్యావరణ మార్గదర్శకాలు, శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ఫారెస్ట్ కమిటీ మెంబర్, ఇంగ్లాండ్ అండ్ వేల్స్ సుప్రీం కోర్ట్ సోలిసిటర్ రమేష్ బి.విశ్వనాథ్ మాట్లాడుతూ క్లీన్ ఎనర్జీ టెక్నాలజీ, స్మార్ట్ అగ్రికల్చర్, కార్బన్ క్యాప్చర్ టెక్నాలజీ వంటి సాంకేతికతలు మంచి వాతావరణానికి అనుకూలంగా ఉంటాయన్నారు. సౌర, వాయు, బయోమాస్ ఆధారిత శక్తులను ఉపయోగించడం వల్ల ఫాసిల్ ఇంధనాల వినియోగం తగ్గి కాలుష్యం తగ్గుతుందని సూచించారు. ఆన్‌లైన్‌లో ముఖ్య అతిథిగా హాజరైన సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా మాజీ జస్టిస్, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మాజీ చైర్‌పర్సన్ జస్టిస్ స్వతంతర్ కుమార్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు తట్టుకునే చట్టపరమైన, సాంకేతిక మార్గాలు గురించి తెలుసుకోవడం అనేది ప్రస్తుత ప్రపంచానికి చాలా అవసరమని పేర్కొన్నారు. వాతావరణ మార్పులకు పరిష్కారం కనుగొనేందుకు సాంకేతికత ప్రధాన పాత్ర పోషిస్తుందని తెలిపారు. సోలార్ ఎనర్జీ, విండ్ ఎనర్జీ, బయో ఎనర్జీ వంటివి వాతావరణ మార్పులను తగ్గించడంలో సహాయపడతాయని సూచించారు. ఫ్యూయల్ మీద ఆధారపడే వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం ద్వారా గాలి కాలుష్యాన్ని తగ్గించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, డీన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్నికల్ ఫెస్ట్‌లతో సృజనాత్మకతకు పదను



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: టెక్నికల్ ఫెస్ట్‌ల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానానికి పదును పెట్టవచ్చని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. చంద్రశేఖర్ తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో శనివారం టెక్నికల్ ఫెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు మొదటి ఏడాది నుంచి నైపుణ్యతలు కలిగిన టెక్నికల్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని, తద్వారా భవిష్యత్తులో ఉద్యోగాలను సాధించేందుకు అవకాశాలుంటాయని సూచించారు. కోడ్ క్రాఫ్ట్ చాలెంజ్, ఇన్నోవేషన్ షోకేజ్, మైండ్ బైట్స్ టెక్నో స్ట్రోమ్, మైమ్ కోడర్ తదితర పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా పలు కళాశాలల నుంచి 500 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈవెంట్స్‌లో సాంకేతిక నైపుణ్యాలను పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వై. సుజిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ ఉత్తమ నైపుణ్యాలు కలిగిన బోధన ద్వారా ఉపాధి కల్పనే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఏ. బాలాజీ, ఏ. రాధాకృష్ణమూర్తి, జె. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ, క్రిమీలేయర్‌పై తీర్పును రద్దు చేయాలి

మాల మహానభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు



సభలో మాట్లాడుతున్న వెంకట్రావు

పొన్నూరు: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ, క్రిమీలేయర్‌పై ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని మాల మహానభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం మాల మహానభ ఆధ్వర్యంలో మాలల యుద్ధ భేరి సభ నిర్వహించారు. వెంకట్రావు అధ్యక్షత వహించి మాట్లాడారు. రిజర్వేషన్ల ద్వారా రాజకీయ పదవులు పొందిన మాల ఎమ్మెల్యేలు వర్గీకరణ క్రిమీలేయర్ వ్యతిరేక ఉద్యమాన్ని తమ స్వార్థ, వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలు కోసం విచ్ఛిన్నం చేయాలని చేస్తున్న కుట్రలను తీవ్రంగా ఖండించారు. మాల ఉద్యోగులపై టీడీపీ ప్రభుత్వం వేధింపులు తక్షణమే ఆపాలని, లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. టీడీపీలోని మాల ఎమ్మెల్యేలు వర్గీకరణ, క్రిమిలేయర్ అంశంలో మాలల అభ్యంతరాలను, నిరసనను సీఎం చంద్రబాబుకు వివరించి వర్గీకరణ ప్రయత్నాన్ని నిలిపివేయాలని కోరారు. మాల జాతి ఐక్యత కోసం వర్గీకరణ వాద రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పేందుకు డిసెంబర్ 14న 10 లక్షల మంది మాలలతో మహోద్యమం సభను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ పలు తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక చప్పిడి వెంగళరావు, జై జనం పార్టీ నేత చప్పిడి రవిశంకర్, మాల మహానభ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల ఉత్పత్తులను ఆదరించాలి



స్టాల్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కమిషనర్

పొన్నూరు: పొదుపు సంఘాల మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు కోరారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తుల ప్రదర్శనను పరిశీలించారు. ఆహార పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే వడ్డీ లేని రుణాల్ని ఉపయోగించుకొని మహిళలందరూ స్వయంశక్తితో ఎదిగి స్త్రీ సాధికారతను సాధించుకున్నప్పుడే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం నాయక్, సీవోలు, ఆర్పీలు, పలువురు ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.